ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 10 ఆగస్టు 2024 | 5



భీమేశ్వరాలయ ఈవోపై ఆర్జేసీ విచారణ 7లో

వాడపల్లిలో పార్కింగ్ సమస్య పరిష్కారానికి కృషి
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు - 8లో

రేపు అమలాపురంలో నిరసన సభ
- మాలమహానాడు నాయకులు - 8లో

పోస్టు ప్లీజ్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ కూటమిలో భాగస్వామ్య పక్షాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకుంటున్నారు. గతం కంటే భిన్నంగా మందీ మార్బలంతో అప్పుడే పార్టీ నేతల ముందు బల ప్రదర్శనలకు దిగుతున్నారు. రాష్ట్రంలో మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పక్షాలు కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో అపూర్వ విజయం సాధించాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి టీడీపీతో పాటు జనసేన, బీజేపీ పక్షాలకు చెందిన ఆశావహులు నామినేటెడ్ పదవుల కోసం తీవ్ర స్థాయిలో పైరవీలు చేస్తున్నారు.

- నామినేటెడ్ పదవుల కోసం పైరవీలు
- టీడీపీ, జనసేన, బీజేపీలో ఆశావహులు
- అమరావతిలో లాబీయింగ్ చేస్తున్న పార్టీల నేతలు
- కీలక పదవుల కోసం జనసేన ఇన్‌చార్జుల ప్రయత్నాలు
- మార్కెట్ కమిటీ, దేవస్థానాల కోసం పోటీ



రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసే పదవుల కోసం కొందరైతే నియోజకవర్గాల్లో ఉన్న మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, దేవస్థానాల చైర్మన్‌లతో పాటు స్థానికంగా ఉండే పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అమలాపురం నియోజకవర్గం నుంచి అయితే ఇప్పటికే జనసేన పార్టీ తరపున పదవుల కోసం పోటీ పడుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. అలాగే బీజేపీ కూడా తమ ఉనికిని చాటుకునే ప్రయత్నంలో భాగంగా నియోజకవర్గంలో కీలక దేవస్థానాలతో పాటు ఇతర పదవుల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించాలని ఒత్తిడి పెంచారు. ఇప్పటికే వివిధ నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులుగా ఎన్నికలకు ముందు తమ ప్రాతినిధ్యం కోసం ప్రయత్నించిన కీలక నేతలు పేర్లను ఆ పార్టీ అధిష్ఠానం పరిగణలోనికి తీసుకుంటున్నట్టు తెలిసింది.

నేతల మధ్య చర్చోపచర్చలు

టీడీపీ ప్రభుత్వం కూటమి పెద్దలతో మాట్లాడి నామినేటెడ్ పదవుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఇటీవల జరిగిన పొలిట్‌బ్యూరోలో కూడా టీడీపీ నేతలు ప్రస్తుతం కీలకంగా ఉన్న వ్యక్తులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే కొంత ఎంపిక ప్రక్రియ కూడా పూర్తి చేసినట్టు సమాచారం. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో రెండు జనసేన స్థానాలు, ఐదు స్థానాలు టీడీపీ గెలుచుకున్నాయి. టీడీపీ నుంచి రాష్ట్ర మంత్రివర్గంలోకి రామచంద్రపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్ కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక నామినేటెడ్ పదవుల కోసం వివిధ నియోజకవర్గాల్లో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ కూటములు ఎవరికివారే వేర్వేరుగా ప్రయత్నాలు చేసుకుంటూ ఎమ్మెల్యేల వద్ద బల ప్రదర్శనలకు సిద్ధమవుతున్నారు.

జనసేనలో పదవుల కోసం..

కొత్తపేట నుంచి జనసేన నేత బండారు శ్రీనివాస్, మండపేట నుంచి వేగుళ్ల లీలాకృష్ణ, రామచంద్రపురం నుంచి పోలిశెట్టి చంద్రశేఖర్, రాపాక రమేష్‌లతో పాటు మరికొందరు తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. వీరితో పాటు నియోజకవర్గ స్థాయిలో జనసేన నుంచే అత్యధిక సంఖ్యలో స్థానిక పదవుల కోసం పోటీపడే వారు గ్రూపులు కట్టి మరీ రాజకీయాలు చేస్తుండడంతో అధికార టీడీపీకి తలనొప్పి వ్యవహారంగా మారుతోంది. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడుతున్నవారి జాబితాలతో ఆయా పార్టీల నాయకత్వాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. మొదటిదశలో కీలక వ్యక్తులకే ప్రాధాన్యం ఇస్తామని టీడీపీ చేసిన ప్రకటనతో ఆ కీలక పదవులను ఆశించే ఆశావహులే అమరావతిలో ఉండి అటు పార్టీ తరపున, ఇటు రాష్ట్ర మంత్రివర్గ సభ్యులతోను లాబీయింగ్ చేసుకుంటున్నారు.

‘సహకార’ డేటాను

ఆన్‌లైన్ చేయాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి



అమలాపురం టౌన్, ఆగస్టు 9: జిల్లాలోని 166 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల డేటాను కంప్యూటరైజేషన్ ఆఫ్ ప్యాక్స్ పేరిట ఆన్‌లైన్ చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సహకార సంఘాల అధికారులను ఆదేశించారు. తొలుత అమరావతి నుంచి రాష్ట్ర వ్యవసాయ సహకారశాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి జేసీ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 2 నాటికి జిల్లాలోని పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిపారు. రోజువారీగా ఆన్‌లైన్ చేసిన డేటాపై సమీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వెబ్‌ల్యాండ్ రెవెన్యూ రికార్డులు, మీ సేవ, మార్క్‌ఫెడ్ కామన్ సర్వీస్ సెంటర్, సున్నావడ్డీ పంట రుణాలు, ఆధార్, ఇంటిగ్రేషన్ ఎల్పీజీ గ్యాస్ పంపిణీ, జనఔషధి కేంద్రం, ప్రజా పంపిణీ వ్యవస్థ తదితర అంశాలన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందు పరచాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 27 శాతం కంప్యూటరైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డ్సుకు నామినేషన్ల

స్వీకరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, ఆగస్టు 9: సమగ్ర శిక్షా, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ 2024-25 నామినేషన్ల కోసం ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. పాఠశాలల వారీగా ఐదు ప్రాజెక్టులు చొప్పున ప్రోత్సహించేందుకు వీలుగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. పాఠశాల యాజమాన్యాలు ఐదు ప్రాజెక్టులు చొప్పున ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వీటిని నిశితంగా పరిశీలించిన అనంతరం కొన్ని ప్రాజెక్టులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తుందన్నారు. పాఠశాల స్థాయిలోనే ప్రాజెక్టుల నమోదును ప్రోత్సహించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. డీఈవో ఎం.కమలకుమారి, ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సైన్స్ ప్రాజెక్టు అధికారి కడలి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



28 మంది తహసీల్దార్లు మళ్లీ జిల్లాకు..

అమలాపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు తహసీల్దార్లను బదిలీ చేశారు. అదే సమయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరితో పాటు కృష్ణా, విశాఖ జిల్లాల నుంచి తహసీల్దార్లను అప్పట్లో కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. సార్వత్రిక ఎన్నికల ఘట్టం ముగిసి ఎప్పుడెప్పుడు సొంత జిల్లాలకు వెళతామా అని ఆశగా ఎదురు చూస్తున్నవారికి ప్రభుత్వం ఊరటనిచ్చింది. దీనిలో భాగంగా ఇతర జిల్లాల నుంచి తిరిగి సొంత జిల్లాకు చేరుకున్న వారికి మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. మలికిపురం తహసీల్దార్‌గా కె.కాశీవిశ్వేశ్వరరావును నియమించారు. ఎంవీ సుబ్బలక్ష్మి (ముమ్మిడివరం), డి.ఏసుబాబు (స్పెషల్ తహసీల్దార్ కేఆర్‌ఆర్‌సీ, ఆర్డీవో కార్యాలయం, అమలాపురం), సీహెచ్ నాగలక్ష్మమ్మ (సఖినేటిపల్లి), ఐపీ శెట్టి (రాయవరం), జీడీ కిశోర్‌బాబు (అమలాపురం), గెడ్డం రవీంద్రనాథ్‌ఠాగూర్ (అల్లవరం), బి.మృత్యుంజయరావు (పి.గన్నవరం), బీటీవీ మురళీకృష్ణ (సూపరింటెండెంట్, కోఆర్డినేషన్ సెక్షన్, కలెక్టరేట్ అమలాపురం), బీఎస్సార్ భాస్కర్ (ఏవో, ఆర్డీవో కార్యాలయం, అమలాపురం). ఎస్ఎస్ఎస్ ప్రసాద్ (రాజోలు), పరమట శ్రీపల్లవి (అయినవిల్లి), ఎల్.ఝాన్సీలక్ష్మీకుమారి (కపిలేశ్వరపురం), వీవీఎల్ నరసింహారావు (ఉప్పలగుప్తం), రియాజ్ హుస్సేన్ (ఏవో, ఆర్డీవో కార్యాలయం, రామచంద్రపురం), సీహెచ్ విజయశ్రీ (కొత్తపేట), బీఎం ముక్తేశ్వరరావు (రావులపాలెం), జవ్వాది వెంకటేశ్వరి (అంబాజీపేట), ఎస్.శ్రీదేవి (మామిడికుదురు), టీఆర్ రాజేశ్వరరావు (ఆత్రేయపురం), కేజే ప్రకాష్‌బాబు (ఆలమూరు), కె.సూర్యారావు (కె.గంగవరం), వై.రాంబాబు (ఏవో, కలెక్టరేట్, అమలాపురం), పి.తేజేశ్వరరావు(మండపేట), డీవీఎస్ అనిల్‌కుమార్ (ఐపోలవరం), పి.సునీల్‌కుమార్ (కాట్రేనికోన), ఎం.వెంకటేశ్వరరావు (రిటైన్డ్ యాజ్ తహసీల్దార్, రామచంద్రపురం), పీవీ రమణకుమారి (సూపరింటెండెంట్, మెజిస్టీరియల్ సెక్షన్, కలెక్టరేట్, అమలాపురం)లను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.



మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ ఖాదర్‌బాషా

యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ కార్యక్రమం

ర్యాలీ ప్రారంభించిన అదనపు ఎస్పీ ఖాదర్‌బాషా

ఉత్సాహంగా మారథాన్



విజేతలతో ఏఎస్పీ

అమలాపురం రూరల్, ఆగస్టు 9: యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించే లక్ష్యంతో జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి తెలిపారు. జిల్లాలో యూత్ ఫెస్ట్‌లో భాగంగా భట్నవిల్లి వై.జంక్షన్ నుంచి శుక్రవారం ఉదయం చేపట్టిన 5కే రన్ మారథాన్‌ను అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. యువతతో కలిసి 5కే రన్‌లో పాల్గొన్నారు. పేరూరు వై.జంక్షన్ వరకు నిర్వహించిన మారథాన్ రన్‌లో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 5కే రన్‌లో విజేతలను అదనపు ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, తాలూకా సీఐ పి.వీరబాబు, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రతినిధులు చంద్రశేఖర్, రామరాజు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పీఎస్ సురేష్‌కుమార్, పీఈటీలు పాల్గొన్నారు. విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేస్తామని భరతలక్ష్మి తెలిపారు

జాతీయ స్థాయి ఇన్నోవేటివ్ కాంటెస్ట్‌కు ఎంపిక

విద్యార్థులను అభినందించిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు అంబాజీపేట మండలం తొండవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. జాతీయ స్థాయిలో మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జైపూర్ నిర్వహించిన స్కూల్ కౌన్సిల్ ఇన్నోవేటివ్ కాంటెస్ట్-2023కు దేశ వ్యాప్తంగా 2 వేల ఎంట్రీలు వచ్చాయి. ఈ కాంటెస్ట్‌లో తొండవరం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎన్.శ్రీరామ్, శ్రీమనస్విని, పార్వతిలు రూపొందించిన ప్రాజెక్టు జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ అన్నారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనలో మెంటార్ గణేష్, నరసింహారావులు విద్యార్థులకు సహకరించారు. త్వరలో న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరిగే ప్రదర్శనలో ఈ ప్రాజెక్టును ప్రదర్శించనున్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు కొబ్బరి పీచుతో తయారుచేసిన కోకోనట్, క్వాయర్ కార్బన్‌డైఆక్సైడ్ ఫిల్టర్ ఏవిధంగా పనిచేస్తుందో విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. డీఈవో ఎం.కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం విద్యార్థులను అభినందించారు.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి

ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ మహేష్‌కుమార్



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ మహేష్

అమలాపురం టౌన్, ఆగస్టు 9: ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను వారసత్వంగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో నాగరికత ముసుగులో ఆదివాసీలు ఉనికిని కోల్పోతున్నా వాటిని కాపాడుకునేందుకు మూలవాసీలు నిరంతరం పోరాడుతూనే ఉన్నారన్నారు. ప్రతీ ఏటా ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. మారుమూల గిరిజన మండలాల్లో ప్రభుత్వం విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరిచిందన్నారు. గిరిజన తెగలు, జనజీవన స్రవంతిలో మంచిగా జీవనాన్ని సాగించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ నకిలీ గిరిజన ధ్రువపత్రాలను నిర్మూలించాలని, పందుల పెంపకానికి స్థలాలు కేటాయించాలని, సామాజిక భవనాలు నిర్మించాలని కోరారు. ఎస్టీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటుచేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని కోరారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘ నాయకులు ఉప్పు శ్రీనివాస్, మానుపాటి గోవిందరావు, బండారు గోవిందు, బండారు సత్యనారాయణను కలెక్టర్ సత్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, వికాస జిల్లా మేనేజరు గోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి ఎదుట స్వర్ణశోభిత ధ్వజస్తంభం

శాస్త్రోక్తంగా వేద పండితుల పూజలు





రెండు గోపురాల నడుమ ధగధగలాడుతున్న బంగారు ధ్వజస్తంభం.. పూజలు చేస్తున్న పండితులు

అన్నవరం, ఆగస్టు9: సత్యదేవుడి సువర్ణ ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమాలు శుక్రవారం శాస్త్రోక్తంగా పండితులు దాత చేతుల మీదుగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం షోడసోపచార పూజలను నెల్లూరుకు చెందిన దాతతో చేయించారు. అనంతరం నూతన ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ గావించారు. చతుర్వేద పండితులు వేదాశీర్వచనాల అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు స్వర్ణశోభతో ధగధగలాడాయి. 300 కిలోల రాగిరేకుపై సుమారు 1800 గ్రాముల బంగారం వినియోగించగా, సుమారు రూ.2 కోట్లు వ్యయమైనట్టు దాత పేర్కొన్నారు. ఇన్చార్జి ఈవో రమేష్‌బాబు, పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, ఆగస్టు9: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఈరంకి వెంకటశర్మ రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా, దాతకు ప్రత్యేక దర్శనంతోపాటు ప్రసాదాలు అందజేశారు.

పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత వెంకటశర్మ



పాదగయ పుష్కరిణిలో స్నానాలు





రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవారికి పూజలు

పాదగయలో మహిళల శ్రావణ శుక్రవారం పూజలు

పిఠాపురం, ఆగస్టు9: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రానికి శ్రావణ శోభతో కళకళలాడింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి నోము ఆచరించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో పాదగయలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఇళ్ల వద్ద శ్రావణ శుక్రవారం నోము ఆచరించే మహిళలు తెల్లవారుజాము నుంచే పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. శ్రావణ శుక్రవారం ఆచరించిన మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు జరిపారు. ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో కొలువై ఉన్న రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠానికి అధిష్టాన దేవతయిన పురుహూతికా అమ్మవార్లకు కుంకుమార్చన, పుష్పార్చన, విశేష పూజలు జరిగాయి. అమ్మవార్లతోపాటు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామిలను భక్తులు దర్శించుకున్నారు. ఉచిత అన్నప్రసాదాలు అందించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ప్రేమ విఫలమై.. బాలిక ఆత్మహత్య



నల్లజర్ల, ఆగస్టు 9: ప్రేమ విఫలం కావడంతో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లజర్ల మండలం ఘంటా వారి గూడెంలో జరిగింది. ఘంటా వారి గూడేనికి చెందిన పెనుమాక శ్రీనివాసరావు, సుశీల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా, చిన్న కుమార్తె లక్ష్మి(17) ఇంటర్ ప్రైవేటుగా చదువుతూ దూబచర్లలోని ఓ మందుషాపులో పనిచేస్తోంది. పక్కనే సెలూన్ షాపు నిర్వహిస్తున్న ఉంగుటూరు మండలం ఎర్రమిల్లిపాడు గ్రామానికి చెందిన శ్రీనుతో ప్రేమలో పడింది. ఇద్దరూ తరచు కలుస్తుండేవారు. ఇంట్లో విషయం తెలియడంతో వివాహం చేసుకోవాలని లక్ష్మి ఒత్తిడి చేయగా, శ్రీను మొహం చాటేశాడు. తాను మోసపోయానని మనస్తాపం చెందిన లక్ష్మి తన తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లిన తరువాత మధ్యాహ్నం ఫోన్ చేసి మిమ్మల్ని చివరిసారిగా చూడాలనిపిస్తోంది.. త్వరగా ఇంటికి రండి.. చెప్పింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ విగతా జీవిగా కనిపించింది. స్థానికుల సహకారంతో లక్ష్మిని దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు స్థానిక వైద్యులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ స్టాలిన్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తుండగా బంధువుల అడ్డుకున్నారు. దీంతో సీఐ దుర్గాప్రసాద్ అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రేమికుడు శ్రీను వచ్చి లక్ష్మి కుటుంబానికి న్యాయం చేసేవరకు ఇక్కడే ఉంచాలని మధ్యాహ్నం నుంచి సాయంత్రం 7 గంటల వరకు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

నాటుతుపాకీ, మందుగుండు పౌడర్ కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

అన్నవరం, ఆగస్టు9: శంఖవరం మండలం వేలంగి గ్రామంలో నాటుతుపాకీ, మందుగుండు సామగ్రి కలిగి ఉన్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి నాటుతుపాకీ, మందుగుండు పౌడర్, సీసపుగుళ్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి చెప్పారు. అన్నవరం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను తెలిపారు. వేలంగికి చెందిన మొండి రాజు నాటుతుపాకీతో అదే గ్రామానికి చెందిన జగన్నాథం వెంకటశివకు చెందిన పెంపుడు కుక్కను కాల్చిచంపాడు. పోలీసులకు ఫిర్యాదుచేయగా ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, అన్నవరం ఎస్‌ఐ వి.కిషోర్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నాటుతుపాకీ తన అన్నదని, అతను మరణించడంతో తన వద్ద ఉందని, వెంకటశివకు చెందిన పెంపుడుకుక్క తన కోళ్లను చంపి తింటోందని, అందుకే కాల్చానని రాజు తెలిపాడు. నాటుతుపాకీ కలిగి ఉండడం నేరం కావడంతో నిందితుడిని అరెస్టు చేశామని డీఎస్పీ చెప్పారు.

ఏటీఎం కార్డులు మార్చి దొంగతనాలు.. వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, ఆగస్టు9: ఏటీఎం కార్డులను మార్చి నగదు దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. నిడదవోలులోని రాయపేటకు చెందిన నిచ్చెనకోళ్ల శివరామకృష్ణ ఏటీఎంల వద్దకు వచ్చే వృద్ధులు, డబ్బులు తీయడంరాని వాళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతుంటాడు. డబ్బు తీయడం రానివారు ఏటీఎం నుంచి డబ్బు తీయమని కార్డు ఇస్తే తప్పుడు పిన్ ఎంటర్ చేసి డబ్బు రావడం లేదని, అసలు కార్డుకు బదులుగా డూప్లికేట్ కార్డు ఇచ్చి అక్కడ నుంచి వెళ్లిపోతాడు. వేరొక ఏటీఎంల నుంచి డబ్బు విత్‌డ్రా చేసి జల్సా చేస్తుంటాడు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి రేలంగి నారాయణరావుకు చెందిన ఏటీఎం కార్డును ఇలాగే ఏమార్చి రూ.33,500 దొంగతనం చేశాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శివరామకృష్ణపై రాజమహేంద్రవరం, విజయవాడ, కొవ్వూరులలో ఏడు కేసులున్నాయన్నారు. నిందితుడిని అరెస్టు చేసి మోటారుసైకిల్, దొంగతనానికి ఉపయోగించిన ఏటీఎం కార్డులను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ శ్రీహరిరావు తెలిపారు. నగదు డ్రా చేయడానికి ఏటీఎంల వద్దకు వెళ్లినప్పుడు అపరిచితులకు పిన్ నెంబరు చెప్పవద్దన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్ : పీడీజే

రాజమహేంద్రవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. శుక్రవారం ఆమె ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులతో వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. సెప్టెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, రాజీకి యోగ్యమైన క్రిమినల్, మోటారు వాహనాల ప్రమాదాలు, చెక్‌బౌన్స్, ప్రీ-లిటిగేషన్ కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అలాంటి కేసులను గుర్తించి ఆ జాబితా డీఎల్‌ఎస్‌ఏకి అందజేయాలన్నారు. ఇదే అంశంపై చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులతోనూ చర్చించారు.

ఆదివాసీ రైతులకు వరం

చింతూరు డివిజనుకు 11 లిఫ్టు ఇరిగేషన్లు మంజూరు

రెండు వేల మంది రైతులకు లబ్ధి

చింతూరు, ఆగస్టు 9: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివాసీ రైతులకు వరం ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజనులోని చింతూరు కూనవరం వరరామచంద్రపురం, ఎటపాక మండలాలకుగాను 11 లిఫ్టు ఇరిగేషన్లను సీఎం చంద్రబాబునాయుడు మంజూరుచేశారు. ఈ విషయాన్ని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని పలు పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈమేరకు చింతూరు ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆవశ్యకతలను పొందుపర్చుతూ సీఎం కార్యాలయానికి చింతూరు ఐటీడీఏ నివేదిక పంపించడం జరిగిందని పీవో తెలిపారు. ఇందులో బాగంగా సీఎం చంద్రబాబునాయుడు చింతూరు ఐటీడీఏ పరిధిలోని రైతులకు రూ.2 కోట్ల నిధుల వ్యయంతో ఇరిగేషన్ ప్రాజెక్టులను మంజూరు చేశారన్నారు. దీంతో రెండు వేలమంది రైతులు లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. పోలవరం ముంపు పరిధి లేని గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల ఇప్పటివరకు ఏడాదిలో ఒకే పంటకు అవకాశం ఉన్న పొలాల్లో ఇకపై ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం కల్గింది.



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో కొండరెడ్ల కుటుంబాలకు కేటాయించిన స్టాండ్ సోలార్ సెట్‌ని ఆవిష్కరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఎస్ఈ కె.తిలక్‌కుమార్

ఇకపై కొండల్లోనూ విద్యుత్ కాంతులు

స్టాండ్ సోలార్ సెట్ల పంపిణీ.. దేశంలోనే తొలి పైలెట్ ప్రాజెక్టుగా చింతూరు డివిజన్

చింతూరు, ఆగస్టు 9: ఎక్కడో కొండలపై జీవనం సాగిస్తున్న కొండరెడ్ల ఆవాసాలు నేటికీ చీకటిలో మగ్గుతున్న విషయం తెలిసిందే. అంతటి ఎత్తైన ప్రదేశాలకు విద్యుత్ సరఫరా లైన్లను ఏర్పాటు చేయలేకపోవడమే దీనికి కారణం. అయితే ఇకపై ఆ ఆవాసాలు కూడా విద్యుత్ కాంతులతో కళకళలాడనున్నాయి. ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకంలో భాగంగా కొండరెడ్ల ఆవాసాలకు స్టాండ్ సోలార్ సెట్ల ద్వారా విద్యుత్ వెలుగులు కల్పించనున్నారు. దేశంలోనే మొట్టమొదటిగా మన రాష్ట్రం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. ఇందులో బాగంగా ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఎస్ఈ తిలక్‌కుమార్‌లు 94 కొండరెడ్ల కుటుంబాలకు స్టాండ్ సోలార్ సెట్లను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు నలుగురు లబ్ధిదారులకు అందించగా, మిగిలినవి కొద్దిరోజుల్లోనే అందజేస్తామని ఎస్ఈ చెప్పారు. తర్వాత ఇదే తరహాలో రాష్ట్రంలోని విద్యుత్ సరఫరాలేని ప్రతి కొండరెడ్డి ఆవాసానికి ఈ పథకం వర్తించనుంది. పూర్తి సబ్సిడీతో ఒక్కో కుటుంబానికి రూ.50 వేల విలువగల సోలార్ సెట్‌ను అమర్చనున్నారు. ఈ సిస్టం ద్వారా ఐదు బల్బులు, ఒక ఫ్యాన్, ఒక లాప్‌టాప్, ఒక మొబైల్‌కు సరఫరా అందనుంది. ఈ కార్యక్రమంలో ఏడీఈ మలాకి, లైన్ ఇన్‌స్పెక్టర్ కె.గణేష్ పాల్గొన్నారు.



ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో గిరిజన తెగల పెద్దలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

గిరిజన తెగల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం

గిరిజన పెద్దలకు సత్కారం

రంపచోడవరం, ఆగస్టు9: ఏజెన్సీలోని అన్ని గిరిజన తెగలతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని శాసన సభ్యురాలు మిరియాల శిరీషదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడు తెగలకు చెందిన గిరిజన పెద్దలను సన్మానించారు. ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన తెగలు గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడుతామన్నారు. జీవో నెం.3ని పునరుద్ధరించే విధంగా తన వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి అన్ని గిరిజన తెగలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సబ్‌కలెక్టరు ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన తెగల సమన్వయంతో ఐటీడీఏ ద్వారా గిరిజనా ప్రాంత అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరగడంపై గిరిజనులకు కృతజ్ఞతలు తెలిపారు. 1/70 చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఏజెన్సీలో సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాగా ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడీఎంహెచ్‌వో కార్యాలయంలో బ్లడ్ డోనేషన్ క్యాంపు నిర్వహించారు. ఏడు తెగలకు సంబంధించిన సంస్కృతిక సంప్రదాయాల స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

డిసెంబరు 14 నుంచి కాకినాడలో

యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు

నేడు ది గోదావరి యూటీఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ పథకం ప్రారంభోత్సవం : ఏపీ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి

దివాన్‌చెరువు, ఆగస్టు9: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర స్థాయి స్వర్ణోత్సవ మహాసభలు డిసెంబరు 14వ తేదీ నుంచి 17 వరకూ కాకినాడలో జరుగుతాయని ఏపీ యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి ఎస్.అరుణకుమారి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం ఆమె మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహాసభలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ ఆతిథ్యమిస్తోందన్నారు. విద్యారంగంలో సమస్యలు, రావాల్సిన మార్పులు, ప్రత్యామ్నాయ విద్యావిధానాలు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం వంటి అంశాలపై చర్చిస్తామని చెప్పారు. ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 వేల మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ సదస్సులు విజయవంతం చేసే కార్యాచరణలో భాగంగా రెండు మూడు జిల్లాలకు కలిపి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా మండల, జిల్లాస్థాయిల్లో ఉపాధ్యాయులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కాగా యూటీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం రాజమహేంద్రవరంలో జరిగే కార్యక్రమంలో ది గోదావరి యూటీఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ పథకం ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. దీనికి యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. అలాగే అమలాపురంలోని శ్రీసత్యసాయి కళ్యాణ మండపంలో జరిగే రాష్ట్ర విద్యాసదస్సుకు ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్ కేఎస్ లక్ష్మణరావు తదితర్లు హాజరవుతారని అరుణకుమారి తెలిపారు.



ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందిన నాగయ్య

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

కరప, ఆగస్టు9: ద్రాక్షారామ-యానాం రహదారిలో గొప్పరేవు వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక యువకుడు మృతి చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం రాజానగరం మండలం ముక్కినాడకు చెందిన పలువురు యువకులు యానాం వెళ్లి మోటర్‌సైకిళ్లపై తిరుగు ప్రయాణమయ్యారు. కోలంక శివారు గొప్పరేవు వంతెనల మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న రామచంద్రపురం-యానాం ఆర్టీసీ బస్సును యువకులు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మేకల నాగయ్య(18) అనే యువకుడు మృత్యువాత పడగా అతని మిత్రులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. యువకులు అతిగా మద్యం సేవించినట్టు స్థానికులు చెబుతున్నారు. ఘటనాస్థలిని ఎస్‌ఐ తులసీరామ్, ఏఎస్‌ఐ డేవిడ్, రెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు

భీమేశ్వరాలయ ఈవోపై ఆర్‌జేసీ విచారణ

ద్రాక్షారామ, ఆగస్టు 9: ద్రాక్షారామ భీమేశ్వరాలయం ఈవో పీటీవీ సత్యనారాయణపై వచ్చిన అవినీతి ఆరోపణలపై శుక్రవారం దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు విచారణ ప్రారంభించారు. మంత్రి సుభాష్ ఆలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని కోరడంతో దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్‌జేసీ విచారణ నిర్వహించారు. పైండావారి సత్రంలో ఆలయ ఈవో పీటీవీ సత్యనారాయణపై ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన వ్యక్తుల నుంచి ఆర్‌జేసీ ఫిర్యాదులు స్వీకరించారు. రథం నిర్మాణంలో అవకతవకలు, దాతలు పలు కార్యక్రమాలు నిర్వహించగా వాటికి దేవస్థానంలో ఖర్చు నమోదు చేసినట్టు తదితర ఆరోపణలపై ఫిర్యాదులు స్వీకరించినట్టు ఆర్‌జేసీ తెలిపారు. దేవస్థానంలో గత ఐదేళ్లలో జరిగిన అంశాలపై ఆరుగురు అధికారులతో కూడిన కమిటీ రికార్డులు పరిశీలన జరుపుతోందని, విచారణ పూర్తయ్యాక కమిషనరుకు నివేదిక అందజేస్తామని ఆర్‌జేసీ సుబ్బారావు తెలిపారు..



అమరావతిలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసిన జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

బ్లూ ఎకానమీ ప్రాజెక్టుపై చర్చించిన పవన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు9: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, అడవులు, సైన్స్‌అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, సీనియర్ పర్యావరణ శాస్త్రవేత్తలు అవనీష్‌కాంత్, సిద్ధార్థలతో సమీక్షించారు. రాష్ట్రంలో సముద్ర వనరుల సమర్ధవినియోగం, బ్లూఎకానమీ ప్రాజెక్టు అమలు అంశాలపై చర్చించారు. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టు అమలుకు వరల్డ్ బ్యాంకు అందిస్తున్న ఆర్థిక, సాంకేతిక సహాయాలను బ్యాంకు ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరించారు. అదే తరహాలో ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలుచేసేందుకు వరల్డ్ బ్యాంకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సంస్థ డైరక్టర్ రమణమూర్తి, శాస్త్రవేత్త సత్యకిరణ్ రాజు, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆకస్మికంగా ప్లజర్ వాహనం దగ్ధం

మలికిపురం, ఆగస్టు9: మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ప్లజర్ వాహనం దగ్ధమైంది. రామరాజులంకకు చెందిన ఓ యువకుడు శుక్రవారం పెట్రోల్ నింపుకుని బయటికి వస్తుండగా కింది భాగం నుంచి మంటలు వ్యాపించడంతో బండిని వదిలి పరుగులు తీశాడు. సమీపంలోని ఒక మెకానిక్ పెట్రోల్ బంకులోని మంటలు ఆర్పే పరికరంతో ప్రయత్నం చేసినప్పటికీ మంటలు ఆగలేదు. ఈ సంఘటనలో వాహనం మొత్తం దగ్ధమైంది. తర్వాత పోలీసులు వచ్చి ఆరా తీశారు.



వ్యవసాయశాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పురందేశ్వరి తదితరులు

రాష్ట్రంలో జాతీయ మామిడి బోర్డు ఏర్పాటు చేయాలి : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు9: జాతీయ మామిడిబోర్డును ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయాలని, తోతాపురి మామిడిని కనీస మద్దతు ధరల జాబితాలో చేర్చి టన్నుకు రూ.25 వేలు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఆ జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి తదితరులతో కలిసి శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్‌లో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు. పల్ప్ ఫ్యాక్టరీలు సిండికేట్‌గా చేరి రైతులను దోచుకుంటున్నాయన్నారు. జాతీయ మామిడి బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా దీన్ని అడ్డుకోవచ్చని వివరించారు. దీనిపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని, ప్రధానితో చర్చించి మామిడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని పురందేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరోపణలు రుజువు చేస్తే మంత్రి, ఎమ్మెల్యే

పదవికి రాజీనామా చేస్తా

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అంబాజీపేట,ఆగస్టు9: హైదరాబాద్‌లో గంజాయి కేసులో పట్టుబడిన వ్యక్తులు తన అనుచరులని జగన్ సొంత ఛానెల్‌లో ప్రచారం చేయడంపై మంత్రి సుభాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఛానెల్‌లో చేసిన ఆరోపణలు రుజువుచేస్తే తన మంత్రి పదవికి, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని మంత్రి సుభాష్ సవాలు విసిరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. గంజాయిని అరికట్టేందుకు అమ్ముతున్న వారి సమాచారం తెలిపితే చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తన సొంత డబ్బులు రూ.5 వేల రివార్డును ప్రకటించానని తెలిపారు. దీనికి జగన్ సొంత ఛానెల్ వక్రీకరించడం తగదన్నారు. గంజాయిని పెంచిపోషించిన వైసీపీ ప్రభుత్వం యువత భవిష్యత్‌తో ఆడుకున్నదన్నారు. గంజాయిని అరికట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కార్మిక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కార్మికశాఖలో 3 వేలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన రూ.3 వేల కోట్లను జగన్ ప్రభుత్వం దోచుకుందన్నారు. కార్మికుల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.450 కోట్లు కేటాయిస్తుందని, వీటిని కార్మికుల కోసం ఖర్చుచేయకుండా వారి ఆరోగ్యంతో ఆటలాడుకుందన్నారు. అలాగే బాలకార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

చెల్లని వర్గీకరణ జిల్లాల వారీగా

ఎలా చేస్తారు : మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 9: భారత రాజ్యాంగంలో 341 ఆర్టికల్ సవరణ లేకుండా వర్గీకరణ చెల్లదు. అటువంటిది రాష్ట్రంలో జిల్లాల వారీగా ఎలా చేస్తారని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్, మాజీ ఎంపీ హర్షకుమార్ ప్రశ్నించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యా సంస్థలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్లు క్రమేపీ ఎత్తివేసేలా సుప్రీంకోర్టు తీర్పు ఉందన్నారు. క్రీమీ లేయర్‌ను కేంద్రం గుప్పెట్లో పెట్టుకుని ఒక్క వర్గీకరణ అధికారాన్ని మాత్రం రాష్ట్రాలకు చుట్టబెడుతుందన్నారు. రాజ్యాంగ సవరణ లేకుండా వర్గీకరణ చెల్లదన్నారు. జిల్లాల వారీగా జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం అవివేకమన్నారు. విజయవాడ బసవపున్నయ్య ఆడిటోరియంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశం శనివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నామని, అందులో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హేమప్రియకు మంత్రి రూ.50వేలు ఆర్థిక సాయం

అయినవిల్లి, ఆగస్టు 9: అయినవిల్లికి చెందిన బాలిక పాటి హేమప్రియ పక్కటెముక విరిగి అనారోగ్యంతో బాధపడుతుందని తెలుసుకున్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆయన వ్యక్తిగతంగా రూ.50వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. అదే గ్రామంలో దూనబోయిన వీరవెంకసత్యనారాయణ రెండేళ్లుగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకుని మంత్రి ఆ కుటుబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.

నూతన ఆవిష్కరణలకు రూపకల్పన జరగాలి

• కలెక్టర్ మహేష్‌కుమార్



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు కుట్టి ఫ్లోర్ క్లీనర్ రోబోట్ 2కె24పై వివరిస్తున్న గొల్లవిల్లి హైస్కూల్ విద్యార్థులు

ఉప్పలగుప్తం, ఆగస్టు 9: మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలకు రూపకల్పన జరగాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అన్నారు. జాతీయ అటల్ మారథాన్ పోటీల్లో 376వ స్థానాన్ని దక్కించుకున్న గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు మదిరి తనూష్‌తేజ, నూకల రేవతీ దివ్యభాను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో తమ ప్రాజెక్టును ప్రదర్శించారు. కలెక్టర్ వారితో మాట్లాడి ప్రాజెక్టు వివరాలను తెలుసుకున్నారు. తాము రూపొందించిన కుట్టి ఫ్లోర్ క్లీనర్ రోబోట్- 2కె24 ప్రాజెక్టు విధివిధానాలను విద్యార్థులు వివరించారు. గృహాలు, ఆసుపత్రులు, రహదారులను ఈక్లీనర్ ద్వారా సులభంగా శుభ్రం చేయవచ్చని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఈ క్లీనర్ ఎంతో ప్రయోజనకరమని వివరించారు. మొబైల్ ద్వారా ఆపరేట్ చేయవచ్చని, నాలుగువేల రూపాయలతో ఈ రోబోట్ క్లీనర్‌ను తయారు చేయవచ్చని చెప్పారు. వివరాలను తెలుసుకున్న కలెక్టర్ విద్యార్థులను, మార్గదర్శకం చేసిన ఉపాధ్యాయులు నల్లా శ్రీనివాసరావు, ఏవీ రామకృష్ణ, ఎ.శ్రీనివాసరావులను అభినందించారు. కార్యక్రమంలో డీఈవో ఎం.కమలకుమారి, డీవైఈవో సూర్యప్రకాష్, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం లంక రాణి పాల్గొన్నారు.

భక్తులకు పార్కింగ్ సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే బండారు



పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, ఆగస్టు 9: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యాలు, ప్రత్యేకచర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చెప్పారు. శుక్రవారం ఆత్రేయపురం మండలం వాడపల్లిలో ఆర్‌అండ్‌బీ చెంతనే ఉన్న 8ఎకరాలు పార్కింగ్ ప్రదేశాన్ని, ఏటి గట్టు సమీపంలో ఉన్న మరో 6 ఎకరాల పార్కింగ్ ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. వర్షం వస్తే పార్కింగ్ బురదమయం కావడంతో ఫిల్లింగ్ పనులు చేపట్టి భక్తులకు పార్కింగ్ కష్టాలు పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపడతామన్నారు. వాడపల్లి కొత్తరోడ్డు చెంతనే ఉన్న 8ఎకరాలు పార్కింగ్ స్థలాన్ని శ్రీనివాసనగర్‌లో పార్కింగ్ ప్రాంతానికి కలిపే విధంగా దారి ఏర్పాటు చేసేందుకు సంబంధిత రైతులతో మాట్లాడాలని ఆయన స్థానిక నేతలను కోరారు. వెంకన్న ఆలయంలో అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. క్షేత్రంలో పెండింగ్ పనులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు యేపుగంటి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ అల్లు వెంకటరమణ, సాధనాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కామన

మండపేట, ఆగస్టు 9: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు శుక్రవారం కోనసీమ జిల్లా ఎస్పీ పి.బి.కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు యార్లగడ్డ రవీంద్ర, వడ్డి నాగేశ్వరరావు, దేశినిడి ఉదయభాస్కరరావు అప్పనరామకృష్ణ, తదితరులు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ.. రేపు అమలాపురంలో నిరసన సభ

అమలాపురం రూరల్, ఆగస్టు 9: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ ఈనెల 11న మధ్యాహ్నం 2 గంటలకు అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో మాలమృతవీరుల సంస్మరణ సభ, వర్గీకరణ వ్యతిరేక నిరసన సభ నిర్వహిస్తున్నట్టు మాలమహానాడు జేఏసీ నాయకుడు పందు అశోక్‌కుమార్ తెలిపారు. ఈదరపల్లిలో శుక్రవారం జరిగిన మాలమహానాడు జేఏసీ సమావేశంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ వాదులు, ప్రజాస్వామికవాదులు, వర్గీకరణ వ్యతిరేక వాదులందరూ పాల్గొని నిరసన సభను విజయవంతం చేయాలని కోరారు. 2004లో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని తీర్పు చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. పార్లమెంటులోనే బిల్లు ఆమోదం పొందాలన్నారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని జేఏసీ నాయకులు కోరారు. త్వరలోనే వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర, జిల్లా నాయకులు పెయ్యల పరశురాముడు, జగడం సత్యనారాయణ, ఉండ్రు బాబ్జి, చీకురుమెల్లి కిరణ్‌కుమార్, జల్లి శ్రీనివాసరావు, చింతా రామకృష్ణ, సాపే బాలరవి, బొంతు రమణ, మెండి డేవిడ్ అంబేడ్కర్, ఉబ్బన శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

ముమ్మిడివరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆరోపించింది. ముమ్మిడివరం మండలం అయినాపురంలో యువజన సంఘం అధ్యక్షుడు బొంతు నాగరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన అత్యవసర సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ సుప్రీంకోర్టు సభ్యుల ధర్మాసనం ఎస్సీ కులాలను ఉప కులాలుగా వర్గీకరించే తీర్పు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. సమావేశంలో నీలం చినబాబు, మోకా రామారావు, ఇసుకపట్ల శివకుమార్, తిరుకోటి సురేష్‌కుమార్, కాట్రు బుల్లబ్బాయి, చెల్లి బాలయోగి, మెండి గోవిందు, బడుగు రాంబాబు, కొమ్మాబత్తుల రాహుల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ఉపసంహరించాలి

మామిడికుదురు: సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై ఇచ్చిన తీర్పును వెంటనే ఉపసంహరించాలని మాలమహానాడు నాయకుల సమావేశం డిమాండ్ చేసింది. మామిడికుదురు ఎస్సీ సామాజిక భవనంలో శుక్రవారం మాలమహానాడు సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఈ నెల 21న జరిగే భారత్ బంద్ కార్యక్రమంలో మాల సోదరులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో భూపతి వెంకటపతి, బొంతు మణిరాజు, నల్లి శ్రీను, గెడ్డం వెంకటేశ్వరరావు, కలిగితి పల్లంరాజు, నెల్లి దుర్గాప్రసాద్, మట్టా సత్తిబాబు, బత్తుల మురళీకృష్ణ, బత్తుల జనార్ధన్, కుసుమ, కుమార్, మహేష్ పాల్గొన్నారు.

'క్విట్ ఇండియా స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధం కావాలి'



గడియార స్తంభం సెంటర్‌లో కార్మిక సంఘాల నిరసన

అమలాపురం టౌన్, ఆగస్టు 9: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా స్ఫూర్తితో ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు సీఐటీయూ, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు మాట్లాడారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రైతు పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, ఖాళీగా ఉన్న రూ.18 లక్షల పోస్టులను భర్తీ చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని నినాదాలతో హోరెత్తించారు. నిరసనలో కార్మిక సంఘాల నాయకులు అప్పారి వెంకటేశ్వరరావు, తాడి శ్రీరామమూర్తి, నిమ్మకాయల వెంకటేష్, వి.మోహనరావు, పొలమూరి శ్రీను, సీహెచ్ దేవేందర్, ఎస్.శ్రీను, దైవకృప, బి.ఈశ్వరి, సూర్యావతి తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ వేడుకలు

అమలాపురం రూరల్: బండారులంకలోని కాంగ్రెస్ జిల్లాశాఖ కార్యాలయంలో శుక్రవారం క్విట్ ఇండియా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జంగా గౌతమ్ తదితరులు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. క్విట్ ఇండియా ఉద్యమ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ రవీంద్ర, వడ్డి నాగేశ్వరరావు, మీసాల బాబి, షకీలా, రెడ్డి బాబు, మాచవరపు శివన్నారాయణ, అప్పన శ్రీరామకృష్ణ, జయన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నూకాంబికా ఆలయ ఈవోగా బాధ్యతల స్వీకరణ



ఈవో వీర్రాజు

ఆలమూరు, ఆగస్టు 9: ఉభయగోదావరి జిల్లాలో పేరుగాంచిన అమ్మవారి ఆలయాలలో ఒకటైన చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉండవల్లి వీర్రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఈవోగా ఎంఎస్‌ఆర్.కృష్ణ పనిచేస్తున్నారు. గతంలో వీర్రాజు ఇక్కడ ఈవోగా పనిచేసి డిప్యూటేషన్‌పై కాకినాడకు బదిలీ అయ్యారు. ఆలయ అభివృద్ధికి మళ్లీ ఆయన సేవలు అవసరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుపై గ్రామస్తులు పట్టుపట్టారు. దీంతో వీర్రాజును ఇక్కడ ఈవోగా నియమించారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను పలువురు నాయకులు అభినందించారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.83 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 9: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని శుక్రవారం భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవలద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,83,368 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, ఆగస్టు 9: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద ట్రస్టుకు రావులపాలానికి చెందిన గొలుగూరి మాధవరెడ్డి దంపతులు శుక్రవారం రూ.10,150 విరాళంగా అందించారు. దాతలను ఆలయ అర్చకులు ఆశీర్వదించి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఎస్పీని కలిసిన మహిళా పోలీసులు

అమలాపురం టౌన్, ఆగస్టు 9: గ్రామ, వార్డు మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ శాఖ అధ్యక్షురాలు కొప్పిశెట్టి వెంకటధనలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును పలువురు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మహిళా పోలీసుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రధాన కార్యదర్శి గుంటు నాగసుశీల, టి.రాజేశ్వరి, ఎస్.ఝాన్సీలక్ష్మి, జి.శ్రీకావ్య, రెడ్డి సువర్ణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మామకు తలకొరివి పెట్టిన కోడలు



బి.దొడ్డవరంలో మామకు తలకొరివి పెట్టేందుకు వెళుతున్న కోడలు

మామిడికుదురు, ఆగస్టు 9: బి.దొడ్డవరం గ్రామంలో కోడలు మామకు తలకొరివి పెట్టిన సంఘటన శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కేతా బాపూజీ (63) అనారోగ్యంతో మృతి చెందాడు. బాపూజీ ఒక్కగానొక్క కొడుకు శివరామసుబ్రహ్మణ్యం ఉపాధి రీత్యా బెహ్రాయిన్‌లో ఉంటున్నాడు. అతను స్వగ్రామం రావడానికి సోమవారం వరకు వీలు పడకపోవడంతో కోడలైన దుర్గాభవానీ తలకొరివి పెట్టడానికి ముందుకు వచ్చింది. పాడే ముందు కుండ చేత పట్టుకుని స్థానిక శ్మశానవాటికలో మామ చితికి అంత్యక్రియలు నిర్వహించింది. సొంత తండ్రికి వలే తలకొరివి పెట్టిన కోడలును పలువురు అభినందించారు.

వైభవంగా తొలి శ్రావణ శుక్రవారం పూజలు



అంతర్వేదిలో ఉపాలయమైన రాజ్యలక్ష్మీఅమ్మవారికి, అప్పనపల్లిలో వరలక్ష్మీ వ్రత పూజలో పాల్గొన్న భక్తులు

అంతర్వేది, ఆగస్టు 9: అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో తొలి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీరాజ్యలక్ష్మితాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రత కుంకుమ పూజలను అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 400 మంది మహిళా భక్తులు అమ్మవారికి జరిగిన కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. తొలుత ఆలయానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో ఉచిత పూజా సామాగ్రిని అందించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించుకుని అమ్మవారి రూపు, పూజా సామాగ్రితో వ్రతం నిర్వహించినట్టు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు విశేష స్పందన

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో ముత్తయిదువులు పూజలో పాల్గొని వ్రతమాచరించారు. కార్యక్రమం ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి పర్యవేక్షణలో ఆలయ అర్చకుల సమక్షంలో ఘనంగా జరిగాయి.

రావులపాలెం: శ్రావణమాసం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈతకోట జాతీయ రహదారి చెంతనే ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమపూజ, అష్టోత్తర సహస్ర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యానాం: శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా యానాం నియోజకవర్గ పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పిల్లరాయ ఆలయంతోపాటు పడవలరేవు వీధిలోని శ్రీలలితాదేవి ఆలయంలో, శివాలయ ప్రాంగణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, స్థానిక గోపాల్‌నగర్‌లోని శారదా దేవి ఆలయంలో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆత్రేయపురం: శ్రావణమాసం తొలి శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించుకుని కుంకుమార్చన జరిపించారు. ప్రతి ఇంట శ్రావణ శుక్రవారం శోభ సంతరించుకుంది. ప్రసిద్ధి ఆలయాల్లో భక్తజన సందడి నెలకొంది. ఆత్రేయపురం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు ఏర్పాట్లు నిర్వహించారు.

నాగపంచమి పూజలు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో శుక్రవారం శ్రావణ నాగపంచమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. నాగజాతి విశిష్టతను, వైభవాన్ని పోతురాజు నాగకనకదుర్గ వివరించారు. వందలాది మంది మహిళలు నాగసాధనలో పాల్గొన్నారు.

టీడీపీ కూటమి పాలనలో పేదలకు పక్కా ఇళ్లు

అల్లవరం, ఆగస్టు 9: గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని టీడీపీ కూటమి పాలనలో అర్హులైన పేదలకు పక్కా ఇల్లు నిర్మిస్తామని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పశువైద్యశాఖ ఆధ్వర్యంలో బోడసకుర్రు ఆర్బీకే వద్ద బోడసకుర్రు, గోపాయిలంక, గోడి పాడిరైతులకు టీఎంఆర్ పశుదాణా పంపిణీకి ఆయన శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని, పేదలకు 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ప్రభుత్వం రూ.4లక్షల రుణం మంజూరు చేస్తుందన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీడీవో కృష్ణమోహన్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, పశువైద్యాధికారి మేడిద నారాయణరావు, అడపా శ్రీనివాసరావు, చింతా శ్రీను, ఓలేటి పరమేశ్వరరావు, ముత్యాల బాబి, రొక్కాల నాగేశ్వరరావు, రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సాంకేతిక విజ్ఞానం సమాజాభివృద్ధికి ఉపయోగపడాలి'

అమలాపురం టౌన్, ఆగస్టు 9: అభివృద్ధి చెందిన శాస్త్ర సాంకేతిక విజ్ఞానం సమాజానికి ఉపయోగపడాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అన్నారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శిరీష అధ్యక్షతన జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో హిరోషిమా, నాగసాకి డేను శుక్రవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు అణ్వాస్త్రాల ప్రయోగాల వల్ల జరిగిన నష్టాలకు హిరోషిమా నాగసాకి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తాయన్నారు. అణ్వాస్త్రాలు వద్దు.. అన్నవస్త్రాలు కావాలని నినదించారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి: ఆత్మ పీడీ

రాయవరం, ఆగస్టు 9: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని ఆత్మ పీడీ జ్యోతిర్మయి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చెల్లూరు గ్రామంలో ఆత్మ సౌజన్యంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో కె.ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ ఆత్మ సౌజన్యంతో రైతులకు శిక్షణ, ప్రదర్శన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలమూరు ఏడీఏ నాగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబరు 15లోపు రైతులందరూ పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్, చుండ్రు వీర్రాజు, దేవు వెంకట్రాజు, ముత్యాల పెద్దబాబు, రైతులు పాల్గొన్నారు.

కడలిలో పొలం బడి కార్యక్రమం

రాజోలు, ఆగస్టు 9: కడలిలో మండల వ్యవసాయశాఖ అధికారి వై.మధుకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకుడు జేవీఎస్ రామ్మోహనరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వరి పంటలో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయాశాఖ అధికారి మధుకుమార్ మాట్లాడుతూ మానవాళిపై పురుగుమందుల విష ప్రభావం, పురుగుమందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం రూరల్ సీఐగా విద్యాసాగర్

రావులపాలెం, ఆగస్టు 9: రావులపాలెం రూరల్ సీఐగా సీహెచ్ విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో వచ్చిన సీఐ బదిలీ కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యాసాగర్ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు సిబ్బందిని సీఐను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

శెట్టిబలిజ సంఘం కార్యవర్గం ఎన్నిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు9: రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా దొంగల శ్రీధర్, ఉపాధ్యక్షులుగా పంపన శ్రీనివాసరావు, పెంకె విశ్వేశ్వరావు, ప్రధానకార్యదర్శిగా కోట శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గ సభ్యుల నియామకం జరిపారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం మాజీ అధ్యక్షులు నరాల ఏడుకొండలు, మాజీ కార్యదర్శి పలివెల నాగరాజు, నాయకులు కంచి సత్యానందం, కట్టా నాగేశ్వరరావు, టేకుమూడి సత్యనారాయణ, కాళ్ల సత్యనారాయణ, పంపన సుబ్బారావు, పంపన సుబ్బారావు, కుడుపూడి కొండ అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

మలికిపురం, ఆగస్టు 9: ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు రూరల్ డెవలప్‌మెంట్ శిక్షణాసంస్థ వారి ఆదేశాల మేరకు మలికిపురం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు తదితర అంశాలపై శిక్షణ జరుగుతుందని ఎంపీడీవో మంగాదేవి తెలిపారు. సాధారణ పరిపాలన, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గౌరవ మంత్రివర్యులచే శిక్షణ పొందిన సర్పంచ్‌లకు ప్రశంతా ప్రతాలు అందిస్తారన్నారు.

యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట, ఆగస్టు 9: నిరుద్యోగ యువత తమ పరిధిలో జరిగే జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకుని తమ భవితకు బాటలు వేసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట శతాబ్ది డిగ్రీ కళాశాల, గ్లోసరి సాఫ్టెక్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాను ఎమ్మెల్యే సత్యానందరావు ప్రారంభించారు. సుమారు 14 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బండారు, కరస్పాండెంట్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులకు తగు శిక్షణ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో ఇటువంటి జాబ్‌మేళాలను నిర్వహించేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కట్టా నాగమోహన్, రెడ్డి సత్యనారాయణ, బూసి జయలక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, విళ్ల మారుతీప్రసాద్, ధర్నాల రామకృష్ణ, బీర ఇసాక్, చింతం విజయకృష్ణ, బండారు సూర్యనారాయణ మూర్తి, చోడపనీడి భాస్కరరావు, దేవపాటి వెంకటేశ్వరరావు, కము జు వెంకటేశ్వరరావు, ముద్రగడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

కె.గంగవరం, ఆగస్టు 9: మండలంలోని అద్దంకిపల్లి గ్రామంలో పేకాటపై పోలీసులు దాడిచేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు పామర్రు ఎస్‌ఐ షేక్ జానీబాషా శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం అద్దంకిపల్లి ఎస్సీ కాలనీలో ఖాళీస్థలంలో పేకాటపై పోలీసులు దాడిచేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7,150 రూపాయలు నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటింటా పారిశుధ్య పనుల పరిశీలన

అమలాపురం రూరల్, ఆగస్టు 9: పేరూరు శివారు కొంకాపల్లిలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో సంపూర్ణ పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. దోమల నివారణకు ఇంటింటా స్ప్రేయింగ్ చేసే పనులను అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు స్వయంగా శుక్రవారం పరిశీలించారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి రుద్రరాజు ఎస్‌ఎస్ సూరపురాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల నిలిపివేతపై హర్షం

కె.గంగవరం, ఆగస్టు 9: గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం నిలిపివేయాలని నిర్ణయించడంపై శుక్రవారం మండలంలోని రేషన్‌డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. కె.గంగవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల డీలర్ల సంఘం నాయకులు కాదా రామకృష్ణ, శ్రీనివాసు, అమ్మలగడ్డ సత్యనారాయణ, పెంకే సత్యనారాయణ, జుత్తుగ నాగబాబు, అనుసూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలి'

ముమ్మిడివరం, ఆగస్టు 9: ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మిడివరం భవిత మానసిక దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు ప్రభుత్వ పరంగానే కాకుండా స్వచ్ఛంద సంస్థలు కూడా చేయూతనిచ్చి తమవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, న్యాయవాదులు కాశి సిద్ధార్థకుమార్, గ్రంధి రామారావు, ఎంఈవో బొజ్జా రమణశ్రీ, ఆర్.ఉదయభాస్కరరావు, భవిత పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.రమాదేవి, టి.శ్రీలక్ష్మి, ఆయా వి.సత్యవేణి, పోలీసు అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పాఠశాలల్లో సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి'

పి.గన్నవరం, ఆగస్టు 9: పార్టీలకు అతీతంగా ఎన్నికైన విద్యాకమిటీ చైర్మన్లు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ఎన్నికైన చైర్మన్లు, మెంబర్లకు ఈసందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఎన్నికైన సభ్యులు ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంతో పాటు విద్యార్థుల హాజరుపట్టి తదితర అంశాలను పరిశీలించాలన్నారు. నామన రాంబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉత్తమ విద్యను అందించాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. నియోజకర్గ ప్రధాన కేంద్రంలో అన్నక్యాంటీన్ ఏర్పాటుకై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఈవిషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి అన్నక్యాంటీన్ ఏర్పాటుకు నావంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్య దర్శి డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరావు, సంసాని పెద్దిరాజు, మట్టపర్తి రామకృష్ణ, ఎం.చంటిబాబు, వాసంశెట్టి కు మార్, సూధా బాబ్జి, చుట్టుగుళ్ల కిషోర్, బోణం బాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, మొల్లెటి శ్రీను, యర్రంశెట్టి సాయిబాబు, జె.శ్రీనివాస్, ఆదిమూల సూరయ్యకాపు, తాటికాయల శ్రీనివాస రావు, యడ్ల ఏసు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ వద్దు.. చేతి సంచులు ముద్దు

మలికిపురం, ఆగస్టు 9: ప్లాస్టిక్‌ను నివారించడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాదరావు అన్నారు. బట్టేలంకలో మానవతామూర్తులు, సామాజిక సేవాసంస్థ బట్టేలంక ఆధ్వర్యంలో సర్పంచ్ బోనం సీతారత్నం ఆర్థిక సహకారంతో తయారుచేసిన బయో డిగ్రేడబుల్ సంచులను ఇంటింటికీ పంపిణీచేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దేవ ప్రారంభించారు. ప్లాస్టిక్ కవర్లు తదితర ఉత్పత్తుల వాడకంవల్ల పర్యావరణ కాలుష్యం పెచ్చుమీరి మానవ జీవితానికే కాక సమస్త ప్రాణికోటికి ఇబ్బంది వస్తుందన్నారు. చేతి సంచులను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, బోనం రాజు, గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, రావూరి నాగు, మల్లిపూడి సత్తిబాబు, బోనం సాయి, బోనం సాయిరామ్ పాల్గొన్నారు.

'మహేష్‌బాబు అభిమానుల సేవలు అభినందనీయం'



ఈదరపల్లి గణపతి థియేటర్ వద్ద, అంబాజీపేటలో మహేష్‌బాబు పుట్టినరోజు కేక్ కట్ చేస్తున్న మంత్రి

అమలాపురం రూరల్, ఆగస్టు 9: సూపర్‌స్టార్ మహేష్‌బాబు అభిమానులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈదరపల్లిలోని గణపతి థియేటర్ వద్ద మహేష్‌బాబు అభిమాన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జన్మదిన వేడుకల కార్యక్రమాలకు మంత్రి సుభాష్‌తో పాటు గంధం పల్లంరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు కేక్‌ను మంత్రి సుభాష్ కట్ చేశారు. అనంతరం మహేష్ అభిమానులు వంద మంది రక్తదానం చేశారు. 1500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. అభిమాన సంఘాల నాయకులు మోగంటి సూర్య, కేతా వర్ధన్, రాజేష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అమలాపురం రమా థియేటర్ వద్ద శుక్రవారం సూపర్‌స్టార్ మహేష్‌బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా థియేటర్‌లో మురారి చిత్రాన్ని ప్రదర్శించారు. థియేటర్ ఆవరణలో అభిమాన సంఘ అధ్యక్షుడు కొప్పిశెట్టి నరసింహమూర్తి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కామాక్షి పీఠంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చొల్లంగి రామకృష్ణ, కొప్పాడి రమేష్, కాలే గోవిందు, దొమ్మేటి శ్రీను, పాటి రవి, సంసాని రమేష్, దొమ్మేటి స్వామి, పితాని మధు, దంగేటి కనక తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలుస్తా : మంత్రి సుభాష్

అల్లవరం, ఆగస్టు 9: మూగ, చెవిటి దివ్యాంగులకు తాను అండగా నిలుస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గోడిలంక భవిత కేంద్రం వద్ద సినీనటుడు మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన కేక్‌కట్ చేశారు. మహేష్‌బాబు ఫ్యాన్స్ నాయకుడు కడలి పృధ్వీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సుభాష్, గంధం పల్లంరాజును మహేష్‌బాబు అభిమానులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమోహన్, కడలి వెంకటేశ్వరరావు, తోట నరసింహారావు, లూటుకుర్తి చిన్న, కడలి అచ్యుతం, ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఘనంగా నులి పురుగుల నివారణ దినోత్సవం

యానాం, ఆగస్టు 9: ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో యానాం ప్రభుత్వ సామన్య ఆసుపత్రిలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి చిన్నారులకు నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డీడీ డాక్టర్ టి.రవిశంకర్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, సాంఘిక సంక్షేమశాఖాధికారి రెయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యదర్శి జవహర్‌తో ఎమ్మెల్యే భేటీ

యానాం, ఆగస్టు 9: పుదుచ్చేరి విద్యాశాఖ కార్యదర్శి జవహర్‌తో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భేటీ అయ్యారు. యానాం విద్యాశాఖకు సంబంధించిన పలు అంశాలపై కార్యాదర్శితో చర్చించారు. విద్యాశాఖలో పనిచేస్తున్న పారా టీచర్స్‌ను రెగ్యులర్ పద్ధతిలో తీసుకోవాలని, హౌస్ కీపింగ్ పనిచేస్తున్న 12మందికి శాశ్వత పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన కార్యదర్శి తగిన విధంగా న్యాయం చేస్తామన్నారని ఎమ్మెల్యే వివరించారు.

రక్తహీనత, గుండెజబ్బులు ఉన్న చిన్నారులను తీసుకురండి: మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 9: రామచంద్రపురం నియోజకవర్గంలో రక్తహీనత, గుండెజబ్బులతో బాధపడుతున్న చిన్నారులను శనివారం ఉదయం 11గంటలకు పట్టణంలో టీడీపీ కార్యాలయానికి తీసుకురావాలని మంత్రి సుభాష్ కోరారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న చిన్నారులకు శాశ్వత చికిత్స అందజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

బుద్ధదేవ్‌కు నివాళి

అమలాపురం టౌన్, ఆగస్టు 9: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సీపీఎం జిల్లాశాఖ కార్యాలయంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుద్ధదేవ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, పొలమూరి శ్రీనివాస్, వి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.